లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చర్యలు

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-నిడదవోలు

నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి ఆదినారాయణ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తన చాంబర్లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణములు పరిశీలించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశములో మునిసిపల్ కమిషనర్ కెవి. పద్మావతి, హౌసింగ్ డిఇఇ , హౌసింగ్ ఎఇ, మరియు హౌసింగ్ కాంట్రాక్టర్లు హాజరయ్యారు.

పెరిగిన వరద ఉధృతి

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- సర ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి 8.16 ల క్షల క్యూసెక్కుల నీరు విడుదల

గోదావరి పాత వంతెన వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి నది వరద కొనసాగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు రాష్ట్రంలోనూ వర్షాలు తోడవటంతో మళ్లీ వరద తీవ్రత పెరుగుతోంది. గత వారం రో జులుగా కొనసాగుతున్న వరద పరివాహక ప్రాంత ప్రజలు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. భద్రాచలం వద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు 46.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఉదయం 7 గంటలకు 39.40 అడుగుల నీటిమట్టం నమోదు కాగా క్రమ క్రమంగా వరద ఉధృతి పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 41.80 అడుగుల నీటిమట్టం నమోదైంది. మధ్యాహ్నం 2 గంటలకు 43.50 అడుగులకు చేరటంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. రాత్రి రెండో ప్రమాదహెచ్చరిక జారీచేశారు దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దిగువన ఉన్న తూర్పుగోదావరి, కోనసీమలలోని పరివాహక ప్రాంతాల్లోనూ డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి. భద్రాచలం నుంచి వస్తున్న ప్రవాహాన్ని అంచనా వేసుకుని ఇక్కడి జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సాయంత్రం 6 గంటలకు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద బ్యారేజీ వద్ద 10.60 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అక్కడి 175 గేట్ల ద్వారా మిగులు జలాలు 8.16లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రానికి విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత బ్రిడ్జి వద్ద 13.90మీటర్లు నీటి మట్టం ఉంది. రాబోయే 24గంటలో వరద ఉధృతి పెరిగే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

కోనసీమలో డేంజర్ బెల్స్

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరగటంతో కోనసీమలోని నదీ పరివాహక ప్రాంతాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. కనకాయ లంక కాజ్‌వే నీట మునిగింది. వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా ఎగువ రాష్ట్రాల్లో వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమవుతున్నారు. అయినవిల్లి మండలంలోని కోటిపల్లి , అయినవిల్లి లంక, పి గన్నవరం మండలంలోని గంటి పెద్దపూడి ఫెర్రీ, ఊడుమూడి లంక, బూరుగులంక ,అరిగెల వారిపేట, మామిడికుదురు మండలంలో అప్పనపల్లి, , పాశర్లపూడి గ్రామాలను అధికారులు సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగుల ఎత్తున నీటిమట్టం చేరితే దిగువకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అధికారుల గణాంకాల ప్రకారం కొనసీమ జిల్లాల్లో 7 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. 13.75 అడుగులకుచేరితే 13 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఫలితంగా 13 గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. అదే బ్యారేజీ వద్ద 17.75 అడుగులకు నీటిమట్టం చేరితే 17 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. దీంతో 12 గ్రామాలపై ప్రభావం ఉంటుంది. పలు కాజ్‌వేలు ముంపునకు గురవటంతో రాకపోకలకూ ఇబ్బందులు తలెత్తనున్నాయి. తూర్పుగోదావరిలో సీతానగరం, కొవ్వూరులో గోదావరి గట్లతో పాటు, కోనసీమజిల్లాలో నాగుల్లంక, తొండవరం, వాకలగరువు గట్లు బలహీనంగా ఉన్నాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో గత మూడ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పట్టణాల్లోని పలు ప్రధాన కూడళ్లు జలమయం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సాగు భూములు ముంపునకు గురయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో సగటు 36.1 ఎంఎం వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో సగటు వర్షపాతం 32.4 ఎంఎం నమోదుకాగా అత్యధికంగా సీతానగరంలో 55 ఎంఎం వర్షపాతం నమోదైంది. రంగంపేట మం డలంలో అత్యల్పంగా 21.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో సగటు వర్షపాతం 40.2 ఎంఎం నమోదు కాగా, తాళ్లపూడిలో అత్యధికంగా 84.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా నిడదవోలులో 10.8 వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా తాళ్లపూడిలో అత్యల్పంగా నిడదవోలులో వర్షపాతం నమోదైంది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

మణిపూర్ ఘటనలకు అడ్డుకట్ట వేయడంలో కేంద్రం విఫలం

మూడు నెలలుగా చోద్యం చూస్తున్న కేంద్ర ప్రభుత్వం
సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మణిపూర్ లో జరుగుతున్న దారుణాలకు అడ్డుకట్ట వేయడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు రాజమహేంద్రవర ఎస్‌సి, ఎస్‌టి ముస్లిం బిసిలు హిందువులు మైనార్టీలు మణిపూర్ లో జరుగుతున్న హింసకాండ ను వ్యతిరేకిస్తూ రాజమహేంద్రవరం అజాద్ చౌక్ నుంచి గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, మరియు పాస్టర్లు, పార్టీలకు అతీతంగా పార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు మరియు ఇమాములు, ఎస్‌సి, ఎస్‌టి యువత తో పాటు మహిళా సంఘాలు కార్యక్రమంలో పాల్గొని మణిపూర్ ఘటనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. అనంతరం అలాగే సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్క నగేష్, ఎండి అమీర్ పాషా, నెల్సన్ బాబు, ముప్పాళ్ళ సుబ్బారావు, కాశీ నవీన్, హబీబుల్లాఖాన్, అజ్రపు వాసు, ఎండీ అక్రమ్, మర్రి బాబ్జి, బర్రె కొండ బాబు, జి.రాంబాబు, షేక్ ఆయేషా అక్బర్, ఆటిఐ.భారతి, నయీం, సుధా రెడ్డి, దినకర్, షేక్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల నిరసనలు

రాజమహేంద్రవరం మణిపూర్ లో ఘటనలపై రాజమహేంద్రవరం డివిజన్ ఆఫీసు ముందు బుధవారం ఐసిఇయు రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఉమ్మడి గోదావరి జిల్లాల ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, ప్రధాన కార్యదర్శి యమ్.కోదండరామ్, జోనల్ అధ్యక్షులు కా. సతీష్ ప్రసంగించారు. కార్యక్రమంలో మహిళా సభ్యురాలు కవిత, మాథ్యూస్, సత్యదేవ, రాజ్యం తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** మణిపూర్ రాష్ట్రంలో జరిగిన హింసాకాండను అదుపు చెయ్యలేని మణిపూర్ ముఖ్య మంత్రి బైరెన్ సింగ్ రాజీనామా చెయ్యాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియూ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు మణిపూర్ ఘటనపై నిరసన వ్యక్తం చేశారు కార్యక్రమంలో దిడ్ల సత్యనారాయణ ఎస్ శ్రీను నరేంద్ర శ్యామ్. పండు యేసు తది తరులు పాల్గొన్నారు. **నిడదవోలు** ఇటీవల మణిపూర్ దమనకాండపై నిడదవోలు మండలం సూరాపురం గ్రామంలో బుధవారం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ సమిశ్రగూడెం ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వలరాంబాబు, సూర్యా కాంతం, ధనలక్ష్మి , చంద్రావతి , వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

నిడదవోలు అంగన్వాడి వర్కర్స్ ఆధ్వర్యంలో..

ఎడతెరపి లేని వాన

ప్రజాశక్తి-ఉంగ్రాజవరం

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మండల జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఇప్పటికైతే వర్షంతో పంట నష్టం, ఆస్తి నష్టం లేనప్పటికీ ప్రజలు ఇళ్లకే పరిమితమై పోవడంతో కర్రీ పాయింట్లు, చిన్నచిన్న దుకాణాలు కస్టమర్లు లేక వెలవెలబోయాయి. గ్రామాలలో పానీపూరీలు, మిర్చి బజ్జీల దుకాణదారులు సైతం ప్రజలు ఎవరు బయటకు రాకపోవడంతో వారి తోపుడుబళ్లను బంద్ చేసినట్లు తెలిపారు. మొన్నటి వరకు ఎండ వేడిమికి దుకాణాలు తెరవని తమకు వర్షాకాలం లాభాలు తెస్తుందనుకున్నామని, రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో నష్టాలు తప్పేటట్లు లేవని సూర్యారావుపాలెంలో బజ్జీల దుకాణదారు మాసాభత్తుల సాంబయ్య ఆవేదన చెందుతున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల, వాతావరణ సూచనల మేరకు మరికొన్ని రోజులు ఇలానే ఉంటే ఎలా అని పలువురు తోపుడు బళ్ళు, చిన్న దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఉంగ్రాజవరం, చిలకపాడు రోడ్డు కూడలి కూడా నిర్మాణుష్యంగా మారింది. వరి చేను ఊడ్పులు పూర్తయిన రైతులు చేలకు నీళ్లు పెట్టాల్సిన అవసరం లేదని, ఇప్పటికీ ఆగితే చేనుకు నష్టం కలగదని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలకు ఇళ్ల మధ్యచేరిన నీరు

గ్రామంలోని రోడ్డు దుస్థితి

రోడ్డు నిర్మాణానికి చందన హామీ

ప్రజాశక్తి-కడియం

గత 15 సంవత్సరాలుగా ప్రజలను వెంటాడుతున్న గ్రామంలోని ప్రధాన రహదారి సమస్యను పరిష్కరిస్తానని రాజమహేంద్రవరం రూరల్ వైసిపి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ హామీనిచ్చారు. మండలంలోని కడియపులంక గ్రామ శివారు వెంకాయమ్మపేట లో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రహదారి పూర్తిగా పాడై బురదమయంగా మారిందని, దీనితో నిత్యం గ్రామ ప్రజలు నరకం చూస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని చందన ను కోరారు. గడప..గడపకూ కార్యక్రమం ద్వారా రూ.40 లక్షల నిధులు కేటాయించి గ్రామంలోని రోడ్డు, డ్రెయిన్లు నిర్మాణానికి కషి చేస్తానని హామీనివ్వడంతో ప్రజలంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ అధ్యక్షులు తాడాల చక్రవర్తి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ యాలి గోపాలం, సొసైటీ ఛైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమీక్షలతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

నియోజక వర్గ స్థాయి సమీక్ష ద్వారా సమస్యల పరిష్కారానికి, ప్రజల ఆకాంక్ష మేరకే ఫలితాలు ప్రతిబింభించడం సాధ్యం అవుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినీమాటోగ్రాఫ్ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కష్ణ, మోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం కొవ్వూరు నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం స్థానిక యువరాజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, డివిజన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా ప్రాధాన్యత భవనాలు, విద్య, హౌసింగ్, ఎన్‌పిఐ, టిడ్కో, వ్యవసాయ, హార్టికల్చర్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యుఎస్, పౌర సరఫరాలకు చెందిన 11 అంశాల మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి మంత్రి సిహెచ్.శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ పరిపాలన సంస్కరణల్లో భాగంగా పాలనా వికేంద్రీకరణ వ్యవస్థను ఏర్పాటు గ్రామాల్లోనికే తీసుకు వెళ్లేందుకు సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చామన్నారు. ఆ ప్రక్రియను మరింత ముందుకు తీసుకుని వెళ్ళే క్రమంలో రైతుకు భరోసా కల్పించేందుకు ఆర్బికే లు, ప్రజారోగ్య పరిరక్షణకు వై ఎస్ ఆర్ హెల్త్ సెంటర్స్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. హోమ్ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రాధాన్యత భవనాలు, ఇతర పనులకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పూర్తి చేసిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధికి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఆమేరకు పరిపాలన పరమైన ఆమోదం ఇచ్చామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద గుర్తించిన పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని ఆదేశించారు. విద్యుత్ శాఖధికారులు నియోజకవర్గంలో పూర్తయినా జగనన్న కాలానీల్లో అన్ని గహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని పెంచడం జరిగిందని, అసుపత్రిలో మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తాన్నారు. ఈ కార్యక్రమంలో జె.సి. తేజ్ భరత్, మున్సిపల్, ఎఎస్‌పి రజని, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గంధ్రోతు అంజలీ దేవి, మాజీ ఎంఎల్‌సి కోడూరి శివ రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు వేణు, వనిత, కలెక్టర్ తదితరులు

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆమన్ ప్రజా మెడికల్ ప్రొపరేటర్ ఇందిరా అన్నారు. బుధవారం గోపాలపురంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అధిక వర్షాల వల్ల పాఠశాలలో చదివే బాలికలకు ఐ ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఉండటంతో జంగారెడ్డిగూడెం సత్య సాయి మెడికల్ ఏజెన్సీ వారి సహకారంతో ఐ డ్రాప్స్, ఐ క్యాప్సిల్స్ ఉచితంగా అందించినట్లు వారు తెలిపారు. విద్యార్థులు సేజన వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఉచితంగా మందులు అందించేందుకు దాతలు ముందుకు రావడంతో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బేతాళ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాషన్ డిపాజిట్ కోసం విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గతంలో హాస్టల్ విద్యార్థులకు హామీ ఇచ్చిన 75 శాతం కాషన్ డిపాజిట్‌ను తిరిగి చెల్లించాలని కోరుతూ విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థులు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కార్యాలయం ఆవరణలో ఆందోళన నిర్వహించారు. బుధవారం సాయంత్రం చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో రాత్రి వరకూ విద్యార్థుల ఆందోళన కొనసాగించారు.

దీనిపై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజారత్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు డి.అశోక్ కుమార్, నాయకులు గంగిరెడ్డి ప్రవళిక తదితరులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తూ ఉదయం నుండి ఉపకులపతి విద్యార్థులకు మభ్యపెడుతూ వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటనే స్పందించి సమస్యను పరిష్కారం చేసేవరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు ఎస్.శ్రావణి, పి.జ్యోతి, ఎస్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సత్యవాడలో గడపగడపకూ..

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. మండలంలోని సత్యవాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునే సందర్భంగా ఎండా వానా, రాత్రీ పగలూ లెక్కచేయకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు ఐవిఎస్ రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ శ్రీనివాసనాయుడు

విద్యార్థినులకు యూనిఫామ్ అందజేసిన దృశ్యం

యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం నాదల శ్రీరామ్ చౌదరి (నాని) ఆయన తల్లి చంద్రకళ జ్ఞాపకార్థం 20 మంది విద్యార్థులకు యూనిఫారం అందజేశారు. బుధవారం టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ళ హరిచంద్ర ప్రసాద్ చేతుల మీదగా యూనిఫామ్‌ను విద్యార్థులకు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వీర్రాజు తెలిపారు. శ్రీరామ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

28న దేవస్థానం భూముల వేలం

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి కౌలునకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వివి.శ్రీనివాసరావు తెలిపారు. కడియపులంక గ్రామ శివారులోని సర్వే నెంబర్ 353/1 లో 4.82 ఎకరాల భూమి , 353/1లో 4.33 ఎకరాల వ్యవసాయ భూమి మూడు సంవత్సరాలు కాల పరిమితులు కౌలు హక్కు పొందేందుకు ఆలయ ప్రాంగణంలో ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇఒ, అధికారుల సమక్షంలో వేలం జరుగునని ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ స్థితిగతులు తెలుపుతూ మండల రెవెన్యూ అధికారులు జారీ చేసిన సాల్వెన్స్ సర్టిఫికెట్ వేలం పాటకు ముందుగా పర్యవేక్షణాధికారికి అందజేయాలన్నారు. పట్టాదారు పాస్ బుక్ ఒరిజినల్ అందజేసి రైతులు వేలంలో పాల్గొనవచ్చని, రూ.10 వేలు ధరావతు చెల్లించాలని తెలిపారు. కౌలు భూముల్లో ఎటువంటి హెచ్చుతగ్గులు ఉన్నా రైతుదే భారమని, తర్వాత ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా స్వీకరింబోమని ఆలయ ఇఒ తెలిపారు.

నూరు శాతం పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-చాగల్లు

అర్హులైన ప్రతి ఒక్కరికి నూరు శాతం పథకాలు అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ కషిచేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 99 శాతం మంది అర్హులకు పథకాలు అందుతున్నాయని, మిగిలిన ఒక్క శాతం అర్హులకు కూడా జగనన్న సురక్ష పథకం ద్వారా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బుధవారం చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 11 ఉచిత సేవలకు సంబంధించిన 2051 ధవపత్రాలను లబ్ధిదారులకు హోంమంత్రి తానేటి వనిత స్వయంగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి మరిన్ని సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని.. చిన్న చిన్న కారణాల వలన, సాంకేతిక లోపం వలన, పథకాలపై పూర్తి అవగాహన లేకపోవడం వలన లబ్ధి చేకూరని పక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మిగిలిన కుటుంబాలకు కూడా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అలాగే పథకాల అమలుకు అవసరమైన టీములను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సర్వీస్ ఛార్జ్ లేకుండా ఉచితంగా అందిస్తున్నామన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కూడిన టీమ్ నియోజకవర్గంలో ప్రతి ఇంటినీ సందర్శిస్తుందని అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరిస్తారని, ఈ దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ నమోదు చేసుకుని టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారని హోం మంత్రి వివరించారు. జగనన్న సురక్షా కార్యక్రమంలో నేరుగా ప్రజల వద్దకు వెళ్తామని, నోరు తెరిచి అడగలేని, పొరపాటున ఎక్కడైనా, ఎవరైనా పథకాలు పొందకుండా మిగిలిపోయి ఉంటే ఆ అర్హులకు కూడా మంచి చేసే కార్యక్రమే జగనన్న సురక్ష కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

పలువురికి జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని పలువురు కుటుంబాలను బుధవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బత్తుల సత్తిబాబు బావ వేదశెట్టి వీరభద్రరావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు అలాగే చింతల రాము అన్నయ్య కుమారుడు చింతల అనిల్ కుమార్ ఇటీవల మృతి చెందారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నెహ్రూ వెంట మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, మారిశెట్టి భద్రం, క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు, ఆడపా భరత్ బాబు, గునుపే భరత్, పోసిన ప్రసాద్ మండిగ గంగాధర్, బాలాజీ గూండా, శివప్రసాద్ నలమహారాజు, రాయవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవతి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బసవా ఏసుబాబు నాయుడు సోదరి కొప్పిశెట్టి వెంకట నాగ సత్యవతి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. ఈ సందర్భంగా నిడదవోలు ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు బుధవారం పాలంగిలో సత్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాస్, కె. సావరం గ్రామ సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైసిపి నేత మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలంచోడవరం గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు. మద్దిపాటి శ్రీనివాస్‌కు బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో రాజమహేంద్రవరం తరలించారు ఆయన చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ తలారి వెంకట్రావు చోడవరం గ్రామానికి చేరుకుని, శ్రీనివాస్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాస్ మరణ వార్త విన్న గ్రామస్తుల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎంఎల్ఎతో పాటు నల్లజర్ల సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, మండల వైసిపి అధ్యక్షులు గగ్గర శ్రీనివాస్, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపిపి శివాజీ, పలువురు నాయకులు కార్యకర్తలు సంతాపం తెలిపారు.

కార్టూ'నిజం'



ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం

సీఎం సభకు బస్సులు తరలించడంతో అవస్థలు	గంటల తరబడి వర్షంలో ఎదురు చూపులు

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కారు

ప్రజాశక్తి -అంబాజీపేట

అంబాజీపేట మండలం ముక్కామల చిన్న వంతెన వద్ద ఆర్‌టిసి బస్సు, కారు బలంగా ఢీకొన్నాయి. విజయవాడ నుండి అమలాపురం వస్తున్న ఆర్‌టిసి బైపాస్ ఎక్స్‌ప్రెస్ అమలాపురం నుంచి మండపేట వెళుతున్న కారు బుధవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యి కారు ప్రక్కనే ఉన్న పాన్ షాపు వద్దకు దూసుకువచ్చింది. అదృష్టవశాత్తు షాపులోకి వెళ్లకుండా ఆగిపోయింది. కారు ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.70 లక్షల సొత్తు చోరీ

ప్రజాశక్తి-కడియం

రామచంద్రపురం నుంచి వేమగిరి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన ఒక మహిళ నగదు, బంగారు వస్తువులు కలిగిన తన బ్యాగు పోగొట్టుకున్న సంఘటన ఈ నెల 15న జరిగింది. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామానికి చెందిన కుడిపూడి శాంతకుమారి తన సోదరి కుమార్తెతో కలిసి రామచంద్రపురం నుంచి స్వగ్రామం చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించింది. కడియం మండలం వేమగిరి చేరేసరికి సుమారు రూ.లక్షా 70 వేల నగదు, బంగారు వస్తువులు ఉన్న బ్యాగ్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. బుధవారం కడియం పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కడియం ఎస్ఐ ఎస్.శివాజీ తెలిపారు.

ఎస్ఇబి దాడుల్లో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కొత్తపేట

యానాం నుంచి మద్యం సీసాలు తెచ్చి, వాటిపై ఆంధ్రప్రదేశ్ మద్యానికి సంబంధించిన ఫేక్ లేబుల్స్ అతికించి అమ్ముతున్న ముగ్గురిని కొత్తపేట ఎస్ఇబి సిఐ మద్దాల శ్రీనివాస్, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన గుడాల చంద్ర శేఖర్‌స్వామిని అదుపులోకి తీసుకుని కారు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణలో అతనికి ఫేక్ లేబుల్స్ అందచేస్తున్న, పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంటకు చెందిన పీతల భాస్కర్ సింగ్, 'ఖద్ర డిజిటల్' యజమాని పొలనాటి సాయిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 270 ఫేక్ లేబుళ్ళు, ప్రింటింగ్‌కు ఉపయోగిస్తున్న కంప్యూటర్, స్కానర్, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫేక్ లేబుళ్ళ పట్టుకున్న సిఐ మద్దాల శ్రీనివాస్, కె.వీరబాబు, సిబ్బందిని ఎస్‌పి ఖాదర్ బాషా అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన సామర్లకోటకు చెందిన కెవివి.సత్యనారాయణను పోలీసులు కాకినాడ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారం రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సి.ఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా సామర్లకోట పట్టణంలో తమ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

ప్రజాశక్తి -గోకవరం

ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభానికి కరెంటు రావడంతో ఆ స్తంభాన్ని తాకడంతో మృత్యువాత పడింది. అచ్యుతాపురం గ్రామానికి చెందిన బత్తుల బుజ్జియ్యకు చెందిన ఈ ఎద్దు మెరవ వీధిలో చనిపోయింది.

20 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక జాతీయ రహదారిపై పోలీసులు 20 కేజీల గంజాయి, ఒక బైక్, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియపులంక జాతీయ రహదారిపై వెంకాయమ్మ పేట సెంటర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా మూటలతో వస్తున్న వాహనాన్ని గుర్తించారు. 20.330 కేజీల గంజాయితో పాటు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోని పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన పోలంకి సుబ్బారావు, ఇదే గ్రామానికి చెందిన గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్న మద్రి శామ్యూల్, విజయవాడకు చెందిన ఒక బాలుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నర్సీపట్నం ప్రాంతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రు గ్రామంలో గోదావరి ఏటిగట్టు వద్ద పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.73,650 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు.

చోరీల కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ క్రైం

కాకినాడ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లాలో కొత్త వాహనాలను చోరీలు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం శ్రీరామ్ నగర్‌కు చెందిన నార్ని సతీష్ చంద్ర, బుడగ ఆనంద్ కుమార్, రాయుడుపాలెంలో సిద్ధార్థ నగర్ చెందిన కర్రి నాగతేజకుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 లక్షల విలువైన కార్లను సర్పవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ చేసుకున్న వారు, ఎస్ఐలు దొంగిలించిన ఆర్‌టిఓ ఒఎల్ఎక్స్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. వీటిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీరిని అరెస్టు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన సర్పవరం సిఐ ఆకుల మురళీకృష్ణ, క్రైమ్ సిబ్బంది జి.సత్యనారాయణ, బి.గణేష్, ఎ.వెంకటరత్నం, ఎం.సతీష్ కుమార్లను అభినందించారు.

ఈ రోడ్లలో ఆదమరిస్తే అంతే..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కాస్త ఆదమరిస్తే సామర్లకోట నుండి నిత్యం కాకినాడ, పిఠాపురం పట్టణాలకు తరలివెళ్ళే ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలు పాలవడం ఖాయం... ఇది ఎక్కడో పుంత రోడ్లలో కాదు గాని సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిలోనూ, సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్లే ప్రధాన రహదారి లోనూ అత్యంత ప్రమాదకరంగా రహదారులు భారీ గోతులతో నిండి ఉన్నాయి. కాకినాడ రోడ్డులో వికె.రాయపురం - మాధవపట్నం గ్రామాల మధ్య ప్రధాన రహదారి గోతుల మయమై కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అది జలాలతో నిండుకొని ప్రజలు అంచనాకు అందకుండా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. పిఠాపురం రోడ్డులో ఏలేరు పెద్ద వంతెన వద్ద నుండి కోదండరామపురం వరకు రహదారి గోతులతో నిండి ఛిద్రమై ప్రయాణికులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. కాకినాడ రహదారిలో ఆర్ అండ్ బి అధికారులు ఎన్ని మార్లు గోతులు పూడ్చిన అవి మరలా మరలా పునరావతం అవుతున్నాయి. రిపేరు పనుల్లో నాణ్యత పాటించకపోవడమే దీనికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. పిఠాపురం ప్రధాన రహదారిని బ్రౌన్‌పేట సెంటర్, కోటపేట నుంచి పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెం గ్రామం వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. దానికిగాను రూ.కోట్ల నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు విస్తరణ పనులను నిలిపివేశారు. దానితో కొత్తగా నిర్మించిన వంతెనకి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో పాటు టిడ్కో గహాల సముదాయాల వద్దనుండి కోదండరామపురం వరకు రోడ్డుకు విపరీతమైన గోతులు పడడంతో వర్షపు నీళ్లలో అవి కనిపించక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారుల పరిస్థితి అందరూ అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రతిరోజూ కనిపిస్తున్న అలాంటి రహదారులపైనే వారు రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా ప్రతిరోజూ వేలాది వాహనదారులు ఈ రహదారులపై ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ రహదారి సమస్య పరిష్కారానికి ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధి ప్రయత్నించడం లేదు. వాహనాలపై ప్రయాణించే ప్రజలు ప్రధానంగా రాత్రి సమయాల్లో గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ప్రజల సమస్యను అధికారులు గుర్తించి ఇప్పటికైనా రహదారుల నిర్మాణం, లేదంటే నాణ్యమైనరిపేరు పనులు చేపట్టి ప్రమాదాల నుంచి ప్రయాణికులను, ప్రజలను కాపాడాలని పలువురు ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

కాకినాడ రోడ్డులో వికె.రాయపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతులు

పిఠాపురం రోడ్డులో టిడ్కో గృహాల వద్ద రోడ్డు దుస్థితి

జగనన్న ఇళ్లు సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రాష్ట్రంలో ఆగస్టు 20 నుంచి 23వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సామర్లకోటలో చేపట్టే అవకాశం ఉన్నందున ఈ అంశంపై మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం సాయంత్రం కమిషనర్ చాంబర్లో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కాకినాడ డిఎల్‌డిఓ పాఠంశెట్టి నారాయణమూర్తి, తహాసిల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి, ఇంకా విద్యుత్ శాఖ, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి పట్నాయక్ సామర్లకోట మున్సిపాలిటీలో జగనన్న ఇల్లు పథకం కింద ఎన్ని గృహాలు నిర్మాణం జరుగుతుంది, ఇప్పటివరకు ఎన్ని గహాలు పూర్తయ్యాయి అనే అంశంపై మున్సిపల్ కమిషనర్ రామారావును, హౌసింగ్ డిఇ రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 2,800 గహాలు నిర్మాణం జరుగుతున్నట్టు వారు వివరించారు. వాటిలో ఇప్పటికి అన్ని పనులు పూర్తయి ప్రారంభానికి 750 గృహాలు సిద్ధంగా ఉన్నాయని పీడీకి వివరించారు. ఆగస్టు 20 కల్లా ఇంకా ఎన్ని గృహాలు నిర్మాణ పనులు పూర్తి చేయగలిగితే వాటన్నిటినీ త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హౌసింగ్ పీడీ అధికారులకు సూచించారు. జగనన్న ఇళ్లు కాలనీలో మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, రోడ్లు, డ్రైవ్ వంటి అన్ని సదుపాయాలు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానిక మున్సిపాలిటీలో గహాలు ప్రారంభానికి విచ్చేసేందుకు దాదాపు అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గహ నిర్మాణాల ప్రగతిని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలపాలని పీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ హౌస్సేన్ ట్రాన్స్‌కో ఎడిఎ కిరణ్, ఎఇ పి.రమేష్ కుమార్, సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న పీడీ సుధాకర్ పట్నాయక్

నవోదయకు ఎన్‌సిసి కమాండర్ ప్రశంస

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో ఫైరింగ్ రేంజ్‌లో శిక్షణ పొందిన వివిధ జిల్లాల ఎన్‌సిసి విద్యార్థులు అద్భుత నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారని ఎన్‌సిసి ఎయిర్ కమాండర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సిసి డైరెక్టరేట్ డిడిజి ఇఎం.రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కల్నల్ ఎకె.రిషితో కలిసి నవోదయ విద్యాలయలోని ఫైరింగ్ రేంజ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వేసవి సెలవులలో వివిధ జిల్లాలకు చెందిన 1500 మంది ఎన్‌సిసి విద్యార్థులకు ఈ విద్యాలయంలో ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఫైరింగ్‌లో ఎన్నో పతకాలు సాధిస్తున్నారన్నారు. ఈ విషయంలో పెద్దాపురం నవోదయ విద్యాలయ అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌సిసి విద్యార్థుల వికాసానికి ఎంతో కృషి చేస్తున్న ప్రిన్సిపల్ కె.రామిరెడ్డిని సత్కరించి మెమెంటో అందజేశారు. ఎన్‌సిసి ఆఫీసర్ పి.కిషోర్ కుమార్, నవోదయ సిబ్బందిని ఆయన అభినందించారు.

శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ఉపాధ్యాయులందరికీ రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కెహెచ్.నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఇఒ నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఒకటి నుండి ఐదు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యారన్నారు. ఈ సమావేశంలో ఆగస్టు మొదటి వారంలో జరగబోయే ఫార్మేటివ్ వన్ అసెస్మెంట్ సంబంధించి సూచనలు ఇచ్చినట్టు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థులకు అమలు చేయాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

సత్వరమే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే పూర్తి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

బడి బయట పిల్లలు, డ్రాపౌట్లను సత్వరమే గుర్తించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే ప్రకారం సంబధిత పాఠశాలల్లో చేర్పించాలని డిఇఒ కె.అన్నపూర్ణ ఆదేశించారు. బుధవారం సామర్లకోట మండలం మాధవపట్నంలో నిర్వహిస్తున్న జిఇఆర్ సర్వే సందర్భంగా మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ అన్నపూర్ణ మాట్లాడుతూ గుర్తించిన బడి బయట పిల్లలను, మధ్యలో బడి మానేసినవారిని ఆయా ఏరియాలకు చెందిన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు చేర్పించే బాధ్యతలు చేపట్టాలన్నారు. జిఇఆర్ సర్వేకు ఎంఇఒలు సహకరించాలని సూచించారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తిచేయాలని డిఇఒ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో బడి బయట గుర్తించిన బడి బయటి పిల్లలు పాలెపు సతీష్, అనసూరి పావనిలను డిఇఒ అన్నపూర్ణ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య, హెచ్ఎం ఎల్.గోవిందరాజులు పాల్గొన్నారు.

పిల్లలను హైస్కూల్ చేర్పిస్తున్న డిఇఒ

ఓటర్ల జాబితాలో మార్పులు

ప్రజాశక్తి-పెదపూడి

ఓటర్ల జాబితా పరిశీలించి, సవరణ, మార్పులు, చేర్పులు బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బిఎల్‌ఒలకు ఓటర్ల జాబితలో మార్పులు, చేర్పులు, సవరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 21 నుంచి ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. బిఎల్‌ఎలు అందరూ వారి పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్ల జాబితా సవరించాలన్నారు. ఓటర్ ఫోటో, అడ్రసు. పేర్లు మార్పులుపై 6ఎ, 7, 8ఎ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటి రామ్ కుమార్, ఆర్.ఐ త్రివేణి పాల్గొన్నారు.

శ్రీరాములు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి-పెదపూడి

టిడిపి సీనియర్ నాయకుడు మూకల శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర బిసి సెల్ మాజీ కార్యదర్శి, కాండ్రేగుల మాజీ సర్పంచ్ మూకల శ్రీరాములు (70) బుధవారం తుదిశ్వాస విడిచారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకష్ణారెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పుట్టాగంగాధర చౌదరి, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు చిర్రా వరప్రసాదరావు, జిల్లా బిసి సెల్ నాయకులు పలివెల బుజ్జి, టేకుమూడి రాంబాబు, నల్లమిల్లి మనోజ్ నివాళులర్పించారు.

ఓటర్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఓటరు వెరిఫికేషన్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్లమూరులో నిర్వహిస్తున్న ఓటర్ వెరిఫికేషన్ సర్వేను బుధవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కళ, వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీర రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేట ఆపాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణ ప్రజలకు నిత్యం రక్షిత తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ చెరువులో చేపల వేటను ఆపాలని కోరుతూ 13వ వార్డు వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ను కలిసి మాట్లాడారు. మంచినీటి చెరువులో చేపలు వేటకు ఒక వారం పది రోజులు తప్ప నెలలు తరబడి అనుమతినివ్వడం వల్ల రాత్రీ పగలూ యథేచ్ఛగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. అసలే వర్షాకాలం ప్రారంభమై జలాలు కలుషితమవుతున్న నేపథ్యంలో చేపలు వేట వల్ల చెరువులో ఉన్న జలాలు మరింత కలుషితమై ప్రజలు డయేరియా, పచ్చకామెర్ల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే చేపల వేట నిలిపివేయాలని ఆయన కమిషనర్‌ను కోరారు. చేపల వేట విషయానికి సంబంధించి కౌన్సిలర్లు నిర్వాహకుల నుంచి ముడుపులు అందుకున్నట్టు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. కేవలం సొసైటీ వారు మున్సిపాలిటీకి చలానా రూపంలో ఆ సొమ్మును చెల్లించారని దానికి కౌన్సిల్‌కి ఎలాంటి సంబంధం లేదని హరిబాబు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చేపల వేట విషయమై కమిషనర్ రామారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా తక్షణమే చేపల వేట నిలిపివేతకు ఆదేశించనున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన విద్యా బోధన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో శాస్త్ర సాంకేతిక రంగాలతో కూడిన విద్యను అందించడానికి ప్రభుత్వం పానెల్ బోర్డులు స్మార్ట్ టీవీలు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2. పి.పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మండలం వేట్లపాలెం హైస్కూల్‌లో వేట్లపాలెం, మేడపాడు కాంప్లెక్స్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ ప్రధాన ఉపాధ్యాయిని పి.అనురాధ అధ్యక్ష వహించారు. రెండో రోజు శిక్షణలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఒ-2 పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన పుల్లయ్యను వేట్లపాలెం కాంప్లెక్స్, మేడపాడు కాంప్లెక్స్ సెక్రటరీలు ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ సహ కార్యదర్శి కె.బలరాం చౌదరి, మేడపాడు, వేట్లపాలెం కాంప్లెక్స్ సంబంధించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు ఎ.వీర్రాజు, కె.ఉమా పాల్గొన్నారు.

పుల్లయ్యను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

యానాం వార్తలు

మత్స్యకారులకు న్యాయం కోసం మళ్లీ దీక్ష

ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ప్రజాశక్తి - యానాం

విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

చేపలవేటనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న యానాం మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ అందించే నష్టపరిహారం సొమ్ము అర్హులందరికీ అందాలని, లేకుంటే మళ్లీ నిరాహార దీక్షకు సైతం సిద్ధమని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితాను మత్స్యశాఖ విడుదల చేసిందని అయితే దానిలో చాలామంది అర్హులైనవారి పేర్లు గల్లంతయ్యాయని అనేక మంది ఆవేదన చెందుతున్నారని చెప్పారు. దీనిపై తాను ఆర్ఎఒ మునిస్వామితో సమావేశమయినట్లు తెలిపారు. తాను రిజిస్టర్ బోట్లతో పాటు అన్ రిజిస్టర్ బోట్లును సైతం ఎట్టిపరిస్థితుల్లోను పరిగణనలోనికి తీసుకుని లబ్దిదారుల జాబితాను తయారు చేయాలని గతంలోనే సూచించినట్టు చెప్పారు. దీంతో సిఎం రంగసామి, ఎల్‌జి తమిళసై సౌందరాజన్, మత్స్యశాఖ మంత్రి,పుదుచ్చేరి ఉన్నతాధికారులు సైతం దానికి అంగీకరించి ఆవిధంగా నిబంధనలకు సవరణ చేశారన్నారు. ఆ విధంగా అప్పట్లో జిఒ విడుదల చేశారన్నారు. ప్రస్తుతం వచ్చిన జిఒలో మార్పులు ఉండటంతో అర్హులైన చాలామందికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చే నిబంధనలనే యానాంలో సైతం అమలు చేయాలని తాను కోరానని తెలిపారు. వేటనిషేధ సమయంలో ఖాళీగా ఉండక ఉపాధి కోసం పలువురు మత్స్యకారులు పలుచోట్లకు కూలిపనికి సైతం వెళ్లారని అటువంటి వారిని ప్రస్తుతం మత్స్యకారులు కాదంటే ఎలా అని ప్రశ్నించారు. అటువంటివారికి సైతం న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. మత్స్యకారుల్లో అర్హులైనవారికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని పరిహారం సొమ్ము ఎవరైతే లబ్దిదారుడు ఉన్నాడో ఆ కుటుంబానికి మాత్రమే చెందాలని వారే దానిని అనుభవించాలన్నదే తన తపన అని పేర్కొన్నారు. రూ.కోట్లాది మత్స్యకారుల పరిహారం ఏ స్వచ్ఛంద సంస్థకో దారిమళ్లకూడదన్నదే తన పోరాటమని పేర్కొన్నారు. చాలామంది దీనిని రాజకీయం చేయాలని చూస్తున్నారని తానే ఆపుతున్నట్లు ప్రచారం చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 6 నెలలనుంచి పరిహారం జరగాలని పుదుచ్చేరిలో అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. తాను, తన కార్యకర్తలు పరిహారం ఆపుతున్నానని అసత్యప్రచారం చేస్తున్నారని అటువంటివాటిని ఖండిస్తున్నట్టు చెప్పారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు పరిహారం ఆపాలని ఎన్ని ఎత్తుగడలు వేసినా అది జరగదని స్పష్టం చేశారు. మత్స్యకారులకు నష్టపరిహారం విషయంలో ఏవైనా అడ్డంకులు సష్టించినా ఆగినా వేలాదిమందితో మళ్లీ నిరవధిక నిరాహారదీక్షకు దిగుతానని, దీనిలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పేదోడు గెలవాలని ప్రతి మత్స్యకార నాయకుడు కోరుకోవాలని, అంతేకాని దీనిని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. పరిహారంకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలకు సవరణలు చేసి మత్స్యకారులందరికీ న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు.

వినతిపత్రం అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఎంఎల్ఎ శివను కలిసిన సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డిఎంకె పార్టీ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ ఆర్.శివను యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ ఉద్యోగుల సంఘ సభ్యులు బుధవారం పుదుచ్చేరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్న సిబ్బందికి రావాల్సిన 30 నెలల బకాయి వేతనాలు, సిబ్బందికి సంబంధించిన పది డిమాండ్లను ఆయనకు వివరించారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. సిబ్బంది రిలే నిరాహార దీక్ష చేపట్టిన సమయంలో వారికి మద్దతుగా యానాం డిఎంకె పార్టీ మద్దతు ప్రకటించిందని అరదాడి పోసియ్య గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, రమణ, శ్రీనివాస్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జాతీయ విద్యా విధానంపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రారంభమై మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్థానిక నవోదయ విద్యాలయంలో ప్రధాన ఆచార్యులు టివిఎస్.ప్రకాష్ రావు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు పాల్గొని జాతీయ నూతన విద్యా విధానం 2020 గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాబోయే 5 సంవత్సరాలలో రూ.27,360 కోట్లు వెచ్చించి విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. ఈ విద్యా విధానం విద్యార్థుల్లో నైపుణ్యాభివద్ధిని పెంపొందిస్తుందని తెలిపారు.


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న వేణుగోపాల్

మహిళకు కారుణ్య నియామకం

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం కాకినాడ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఒకరికి ఉద్యోగ నియామక పత్రం అందించారు. దేవీపట్నం మండలము, గొందూరు గ్రామంలో ఎస్‌జిటిగా పని చేస్తూ అనారోగ్యం కారణంగా కురుపల్లి గోపి మరణించగా ఆయన భార్య టివి.రామలక్ష్మిని దేవీపట్నం మండల పరిషత్‌లో ఆఫీసు సబర్డినేట్‌గా నియమిస్తూ నియామక ఉతర్వులు అందజేశారు. ఈ కార్యక్రమములో ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎ.రమణారెడ్డి, ఎపి పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్‌వివి.రమేశ్, పాల్గొన్నారు.